## క్లుప్తంగా

### నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతులు చేపట్టనున్న కారణంగా ఈ నెల 14,15 తేదీల్లో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేద్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం వట్లూరు సబ్ స్టేషన్ పరిధిలోని సత్రంపాడు, ఆర్టీసీ కాలనీ, సత్రంపాడు ప్రధాన రహదారి, యాదవ్ నగర్, సౌభాగ్యలక్ష్మి దేవి ఆలయం ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 15న చాటపర్రు 11కేవీ టౌన్ ఫీడర్ పరిధిలో చాటపర్రు, చంద్రబాబు నాయుడు కాలనీ, ఎస్సీ కాలనీ, బాబూఖాన్ గూడెం, చాటపర్రు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

### రైతులకు సబ్సిడీపై రబీ విత్తనాలు అందించాలి

ఏలూరు (టూటౌన్): రైతులకు, కౌలు రైతులకు రబీ సాగుకు అవసరమైన వరి, అపరాల విత్తనాలు 50 శాతం సబ్సిడీపై అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. బుధవారం స్థానిక అన్నే భవనంలో రబీ విత్తన కొరతపై ఆయన మాట్లాడారు. ఏపీ సీడ్స్ వద్ద, రైతు సేవ కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన రబీ విత్తనాలు అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ, ఏపీ సీడ్స్ మధ్య సమన్వయ లోపం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రబీలో కృష్ణా డెల్టా పరిధిలో రెండవ పంట వరికి సాగునీరు ఇవ్వకపోవడంతో రైతులు ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారని అన్నారు.

### డీఎస్సీ ఉచిత శిక్షణ వాయిదా

ఏలూరు (టూటౌన్): ఏలూరు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి జరగాల్సిన మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ తరగతులు వాయిదా వేసినట్లు జిల్లా బీసీ సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గమనించాలన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, ఉచిత కోచింగ్ నిర్వహణకు ఈసీ అనుమతి కోరామని, తదుపరి ఆదేశాలు వచ్చిన వెంటనే ఉచిత మెగా డీఎస్సీ శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు.

# డ్రెయిన్లు ఆక్రమించి వ్యాపారాలు

- చూసీ చూడనట్లు వదిలేస్తున్న అధికారులు
- వర్షం కురిస్తే రోడ్లపైకి మురుగునీరు
- ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ
- నివారణా చర్యలు చేపట్టాలంటున్న నగర వాసులు



కోర్టు సెంటర్‌లోని డ్రెయిన్‌ను ఆక్రమించిన దృశ్యం



వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయం వద్ద పూడుకుపోయిన డ్రెయిన్



జిల్లా కోర్టు మెయిన్ గేట్ పక్కన డ్రెయిన్ సమీపంలో దుకాణాలు



డ్రెయిన్, రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన బిర్యానీ పాయింట్

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో డ్రెయిన్లను యథేచ్ఛగా ఆక్రమించి వాటిపైనే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో రోడ్లపైన రద్దీ ఏర్పడటంతో పాటు, కొద్దిపాటి వర్షం చినుకులకే మురుగు నీరు రోడ్లపైకి ప్రవహించి ప్రయాణికులు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్లలో ఇష్టానురీతిలో డ్రెయినేజీలను ఆక్రమించి వాటిపైనే నిర్మాణాలు చేపట్టి రోడ్డు మీదకు వచ్చి మరీ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇది తెలిసీ సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.నగర ప్రజల ఆరోగ్యం, ట్రాఫిక్ జామ్ వంటి వాటిని నివారించేందుకు వీలుగా తక్షణం డ్రెయిన్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించి సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

**జిల్లా కోర్టు సెంటర్‌లో ఆక్రమణలు**

ఏలూరులో అత్యంత రద్దీగా ఉండే ఫైర్ స్టేషన్ సెంటర్ కూడలి నుంచి అమీనా పేట వెళ్లే మార్గంలో జిల్లా కోర్టు సెంటర్ ఉంది. డీఈఓ ఆఫీసు సెంటర్, జిల్లా కోర్టు ప్రధాన సెంటర్ మధ్య వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయాన్ని ఆనుకుని మురుగు కాలువ ఉంది. ఈ మురుగు కాలువను ఆనుకుని పెద్ద సంఖ్యలో వ్యాపార దుకాణాలున్నాయి. ఈ దుకాణాల్లో వచ్చే చెత్త మొత్తం ఈ డ్రెయినేజీలోనే వేసేస్తున్నారు. డ్రెయినేజీలపై సిమెంట్ బిళ్లలు వేసి వాటిపైన వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. డీఈఓ ఆఫీసు సెంటర్ నుంచి జిల్లా కోర్టు ప్రధాన గేటు వరకు పదుల సంఖ్యలో డీటీపీ సెంటర్లు, స్టాంప్ పేపర్ల, స్టాంపులు విక్రయించే సెంటర్లున్నాయి. దీంతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ డ్రెయినేజీపైనే వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.డ్రెయినేజీలు పూర్తిగా చెత్త, చెదారంతో నిండిపోయి ఆక్రమణల కారణంగా వాటిని తొలగించే పరిస్థితి లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే మురుగు నీరు రోడ్లపైకి పొర్లడంతో దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి.

### నిత్యం ట్రాఫిక్ రద్దీ



నగరంలోని చాలా ప్రాంతాల్లో డ్రెయినేజీని దాటి రోడ్డు మీదకు వచ్చి దుకాణాలు ఏర్పాటు చేయడంతో వీటి వద్ద వినియోగదారులు, వారి వాహనాలతో రద్దీ నెలకొంటోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్ద సంఖ్యలో ఆఫీసులకు, కాలేజీలకు, అమీనాపేట హాస్టళ్లకు వెళ్లే విద్యార్థులతో ఈ మార్గం నిత్యం రద్దీగా కనిపిస్తుంది. దుకాణాలు కొంచెం వెనక్కు ఉంటే కొంత వరకైనా ట్రాఫిక్ సమస్య తప్పుతుంది.

– వెంపా నాగరాజు, స్థానికుడు, ఏలూరు

### ఆటోలను ఇక్కడే ఆపుతున్నారు



జిల్లా కోర్టు సెంటర్ నుంచి డీఈఓ ఆఫీసు సెంటర్ మధ్య దుకాణాలను ఆనుకుని ఆటోలను ఆపుతున్నారు. ఆటోలో పూర్తిగా ప్రయాణికులు ఎక్కేంత వరకు వాటిని అక్కడే ఉంచుతున్నారు. దీంతో ఈ సెంటర్‌లో సగం రోడ్డు వరకూ వాహనాలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ రద్దీతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డ్రెయినేజీ దాటుకుని వ్యాపారాలు నిర్వహించడమే దీనికి కారణం.తక్షణం ఆక్రమణలను తొలగించి సామాన్య ప్రజల ఇబ్బందులను తీర్చాలి.

– బొల్లారపు నాగరాజు, స్థానికుడు, ఏలూరు

### 16న న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16న దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు, మహిళలకు బాలికలకు న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సులో మహిళలు, బాలికలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

### చేనేత రంగానికి అన్యాయం

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర బడ్జెట్లో చేనేతకు తీవ్రమైన అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడుపు కన్నయ్య ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2.94 లక్షల కోట్లు అనేక రంగాలకు కేటాయింపులు చేసి చేనేతకు కేటాయింపులు చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. వ్యవసాయం తర్వాత రెండో పెద్ద పరిశ్రమగా రాష్ట్రంలో చేనేత పరిశ్రమ ఉందన్నారు. బడ్జెట్లో చేనేత రంగానికి రూ.2 వేల కోట్లు కేటాయించి చేనేతను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

### ఆన్‌లైన్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ అందించవచ్చు

ఏలూరు(మెట్రో): జీవన్ ప్రమాణ్ ఫేస్ అప్లికేషన్ డౌన్ లోడ్ చేసుకోవడం ద్వారా ప్రతి పెన్షనరు తమ ఇంటివద్దనే లైఫ్ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్ ద్వారా సమర్పించుకోవచ్చని పెన్షనర్ల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంజూ గుప్తా తెలిపారు. బుధవారం స్థానిక ఆర్.ఆర్.పేటలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను ప్రమోట్ చేస్తున్న దృష్ట్యా పింఛన్‌దారులు ఇక నుంచి వారి ఇంటి నుంచే లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించవచ్చన్నారు. దీనికి ప్రతి పెన్షనరు వాళ్ల స్మార్ట్ ఫోన్‌తో ఆధార్ నంబరుతో జీవన్ ప్రమాణ్ ఫేస్ అప్లికేషన్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూబీఐ రీజనల్ హెడ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## క్రీడల్లో ప్రతిభ చూపిన థెరిస్సా విద్యార్థినులు



విజేతలను అభినందిస్తున్న సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 9,10,11 తేదీల్లో వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో తమ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ చూపారని నగరంలోని సెయింట్ థెరిస్సా మహిళా జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ సిస్టర్ మెర్సీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని ఎంసీహెచ్ స్కూల్‌లో అండర్ 19 స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో తమ కళాశాల నుంచి పది మంది క్రీడాకారులు పాల్గొని రాష్ట్రస్థాయి ద్వితీయ స్థానం గెలుపొందారన్నారు. విజయవాడ సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పాల్గొని ద్వితీయ స్థానం సాధించారని, కడప జిల్లా రైల్వే కోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో ఏడుగురు విద్యార్థులు పాల్గొని తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. దీనితో పాటు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహించిన నెట్‌బాల్ పోటీలో ఒక విద్యార్థిని పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. అక్టోబర్‌లో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీలో కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారన్నారు. కొందరు విద్యార్థినులు జాతీయ జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. జాతీయ జట్టుకు ఎంపికైన వారంతా ఈ నెల, డిసెంబర్‌లో పంజాబ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులను ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా డిగల్, కళాశాల పీడీ ఐ.ఆండాళ్ళు ప్రత్యేకంగా అభినందించారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తీరుపై కినుక

- స్వచ్ఛంద సంస్థలను కలుపుకోని కార్యదర్శి
- వారోత్సవాలకు దూరంగా ఉంటున్న వివిధ సంస్థలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేటి నుంచి జాతీయ 57వ జాతీయ గ్రంథాల వారోత్సవాలు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యం జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానున్నాయి. దీనితో పాటు నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం, బాలల గ్రంథాలయం, మహిళా గ్రంథాలయంలో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించే ఉత్సవాలపై నీలినీడలు పడినట్టు చర్చ జరుగుతోంది. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వ్యవహార సరళే ఇందుకు కారణంగా చెప్పుకుంటున్నారు. గతంలో గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభానికి దాదాపు వారం పది రోజుల ముందే నగరంలోని స్వచ్ఛంద సంస్థలు, కళా సంస్థలు, సామిత్య సంస్థల ప్రతినిధులతో కార్యదర్శి సమావేశం ఏర్పాటు చేసి వారోత్సవాలు విజయవంతం చేయడానికి వారితో కార్యక్రమాలు నిర్వహించేవారు. ప్రస్తుత కార్యదర్శి ఎవరితోనూ సమావేశం ఏర్పాటు చేయకపోవడంతో వారు కినుక వహించి ఉత్సవాలకు దూరంగా ఉన్నారంటున్నారు. గ్రంథాలయ సంఘం రాష్ట్ర నాయకుడు లేళ్ళ వెంకటేశ్వరరావు, జిల్లా రచయితల సంఘం నాయకులు కార్యదర్శి వ్యవహార సరళిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యదర్శి ఉండగా తాము ఉత్సవాల్లో పాల్గొనేది లేదని భీష్మించుకున్నారు. ఈ ఏడాది ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా కేవలం స్వచ్ఛంద సంస్థల సహకారంతోనే ఉత్సవాలు నిర్వహించాలని గ్రంథాలయ పరిషత్ నుంచి ఆదేశాలు ఉన్నప్పటికీ కార్యదర్శి నగరం పరిధిలోని సంస్థల ప్రతినిధులతో సంప్రదింపులు చేయకపోవడాన్ని వారు తప్పుపడుతున్నారు.

**షెడ్యూల్ ఇదే**

14వ తేదీన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలతో పాటు నెహ్రూ జయంతి వేడుకల నిర్వహణ, 15న పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠనం ప్రాముఖ్యతపై కార్యక్రమాలు నిర్వహిస్తారు. 16న గ్రంథాలయ ఉద్యమకారులు ఆర్ఎస్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణ వంటి ప్రముఖుల విశేషాల వివరణ.

17న రచయితల సందేశాలు, సెమినార్లు, కవి సమ్మేళనాలు నిర్వహిస్తారు. 18న విద్యార్థులకు వక్తృత్వం, డ్రాయింగ్, వ్యాస రచన, క్విజ్, క్రీడల పోటీలు, (ముఖ్యంగా గ్రంథాలయాల పాత్ర, నిర్వహణ, ఉపయోగాలు), 19న మహిళా దినోత్సవం, దిశ చట్టం, మహిళా సాధికారితపై చర్చ కార్యక్రమాలు, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, చదువంటే మాకిష్టం ప్రాధాన్యత, విజేతలకు బహుమతుల ప్రదానం, వారోత్సవాల ముగింపు.

### జెడ్పీ గెస్ట్‌హౌస్‌కు తాళం



మునుపెన్నడూ లేని నిబంధనలు అధికారులకు ఇప్పుడు గుర్తుకొచ్చాయి. జిల్లా పరిషత్ అతిథి గృహానికి ఎన్నికల కోడ్ సాకుతో తాళాలు వేశారు. సోమవారం వైఎస్సార్‌సీపీకి సంబంధించిన జెడ్పీటీసీలు ఇదే అతిథి గృహంలో సమావేశమై జెడ్పీ సమావేశ మందిరానికి, కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్ళారు. దీంతో అధికారులకు హఠాత్తుగా ఎన్నికల కోడ్ గుర్తుకు వచ్చింది. వెంటనే గేటుకు తాళాలు వేసి ఎన్నికల కోడ్ ఉన్నందున అతిథి గృహానికి తాళం వేస్తున్నట్లు నోటీసు పెట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

## పన్ను వసూళ్లకు ప్రత్యేక యాప్

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర సచివాలయంలోని పంచాయతీశాఖ కార్యాలయం అధికారులు ఈ కాన్ఫరెన్స్ ద్వారా మండలంలో పంచాయతీ సిబ్బందితో ముచ్చటించారు. ఇందులో గ్రామ పంచాయతీలో ప్రజల నుంచి పన్నుల వసూళ్లపై ప్రత్యేక యాప్ రూపొందించనున్నామని అధికారులు వివరించారు. యాప్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పన్ను వసూళ్లు, బకాయిలు, ఆస్తి వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది యాప్‌లో పంచాయతీ సమగ్ర విషయాలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఇందుకోసం మండలంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ అందించామన్నారు. వీరి ద్వారా ఇతర పంచాయతీ సిబ్బంది యాప్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా సమాచారం మొత్తం యాప్‌లో పొందుపరిచిన తర్వాత రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆవిష్కరిస్తారన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం ఈ యాప్ ద్వారానే కొత్త పన్నుల వేయడం, పెంచడం, పంచాయతీ నిధులు ఖర్చులు, రాబడి తదితర పరిపాలన వ్యవహారాలను నిర్వహిస్తుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ఉపాధ్యాయుల నుంచి వినతులు స్వీకరిస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు అన్నారు. పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లాలో పర్యటించిన ప్రతి మండలంలోనూ తమ సంఘానికి ఉపాధ్యాయుల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. ఉపాధ్యాయులను వారి పాఠశాలల్లో కలిసిన సందర్భంలో వెలుగులోకి వచ్చిన వివిధ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను జిల్లా విద్యాశాఖాధికారితో పాటు సంబంధిత శాఖాధిపతులకు నివేదిస్తానని ఆయన తెలిపారు.

## బాలల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు



బాలల హక్కుల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బాలలంతా వారికున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు జె.రాజేంద్రప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక కృష్ణదేవరాయ మున్సిపల్ హైస్కూల్లో జాతీయ బాలల హక్కుల దినోత్సవం వేడుకల ప్రారంభ సందర్భంగా బాల బాలికలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జాతీయ బాలల హక్కుల దినోత్సవం ముఖ్య ఉద్దేశాన్ని, బాలల హక్కుల పరిరక్షణలో కమిషన్ విధి విధానాలను, జిల్లాస్థాయిలో బాలల హక్కుల పరిరక్షణలో ఉన్న విభాగాల పనితీరును వివరించారు. బాలలకు ఉన్న ప్రధానమైన చట్టాలను తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓ బీ. పద్మావతి మాట్లాడుతూ ఐసీడీఎస్ ద్వారా అందించే సేవలను వివరించారు. స్థానిక ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 16న సీఆర్ఆర్ కళాశాల స్నాతకోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 16న నగరంలోని సీఆర్ఆర్ అటానమస్ కళాశాల ఆడిటోరియంలో స్నాతకోత్సవం (కాన్వొకేషన్) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, డిగ్రీ కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, పీజీ కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వై. శ్రీనివాసరావు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 2022లో సీఆర్‌రెడ్డి అటానమస్ కళాశాలలో డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు (యూజీ 2019–22 బ్యాచ్, పీజీ 2020–22 బ్యాచ్) ఒరిజినల్ డిగ్రీలను ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు తమ వెంట డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్ జెరాక్స్ కాపీని తీసుకురావాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బీవీఆర్‌డీ ఫణికుమార్ తెలిపారు.

### ఎన్నికల నియమావళిని పాటించాలి

ఏలూరు(మెట్రో): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ నియోజవర్గ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబరు 5న నిర్వహించే ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

### ఎస్సీ సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో 27 రకాల దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరించి, నిధులు కేటాయించాలని దళిత్ ప్రొటెక్షన్ ఫోరం ఫౌండర్ చైర్మన్ నూకపెయ్యి కార్తీక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాలుగా ఆయా ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల కోసం పోరాడామని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల అమలు లేక దళిత బిడ్డలు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వలస పోతున్నట్లు చెప్పారు.

### భర్త, అత్త మామలకు ఐదేళ్ల జైలు శిక్ష

ఏలూరు (టూటౌన్): వరకట్నం వేధింపుల కేసులో నిందితులైన భర్త, అత్త మామలకు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.7 లక్షలు జరిమానా విధిస్తూ ఏలూరు మహిళా కోర్టు 5వ అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి బుధవారం తీర్పు వెలువరించారు. కోర్టు ఏపీపీ డీవీ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట చిన్నపేట కొత్త కాలనీకి చెందిన కంబత్తుల రత్నరాజు కుమార్తె చైతన్యకు పెనుగొండ మండలం చినమల్లంకి చెందిన చోడగిరి శామ్యూల్ పెద్ద కుమారుడు ఏఆర్ కానిస్టేబుల్ మహేంద్ర కుమార్‌కు వివాహమైంది. రూ.7 లక్షలు, మోటార్ సైకిల్ కట్నం కానుకలుగా ఇచ్చారు. రూ.2 లక్షల విలువైన సారె పెట్టారు. మహేంద్రకుమార్, చైతన్యకు ఒక కుమారుడు పుట్టాడు. అనంతరం రూ.5 లక్షల అదనపు కట్నం కోసం వేధించడంతో చైతన్య ఆచంట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 2020లో నాటి ఎస్సై బీఎస్‌డీఆర్ ప్రసాద్ కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో మహేంద్ర కుమార్, శామ్యూల్, మరియమ్మకు ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. రూ.7 లక్షల జరిమానా విధించి, ఈ మొత్తాన్ని చైతన్యకు ఇవ్వాలని పేర్కొన్నారు. మరో ముగ్గురు నిందితులకు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

### రైలు ప్రమాద మృతుల వివరాల గుర్తింపు

ఏలూరు (టూటౌన్): రెండు వేర్వేరు రైలు ప్రమాదాల్లో మృతి చెందిన యువకుడు, వృద్ధుడు వివరాలను రైల్వే పోలీసులు గుర్తించారు. ఈనెల 9న ఏలూరు జూట్ మిల్ వంతెన క్రింది భాగంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందిన వృద్ధుడు ఏలూరుకు చెందిన దర్శా శివయ్య (62)గా గుర్తించారు. శివయ్య మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి, అతని బంధువులు అప్పగించారు. 11న రాత్రి వట్లూరు సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందిన యవకుడు శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలస మండలం అంబకండికి చెందిన దూబ సాయి (20)గా గుర్తించారు. సీఆర్ రెడ్డి కళాశాలలో ఈఈఈ మూడో సంవత్సరం చదువుతున్న సాయి ఫోన్ మాట్లాడుతూ పట్టాలు దాటుతుండగా రైలు అతన్ని ఢీ కొట్టింది. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

### పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఏలూరు రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా అధికారి ఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. బుధవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో సీజనల్ వ్యాధులపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలం వచ్చినందున సీజనల్ వాధులు సంక్రమిస్తాయన్నారు. దీన్ని గుర్తించి ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతిరోజూ వేడి ఆహారం భుజించాలన్నారు. గోరువెచ్చని నీరు తాగడంతో పాటు ఉన్ని దుస్తులు ధరించాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో వ్యాధులను వ్యాపింపజేసే దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయని, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు కృష్ణ, జే గోవిందరావు తదిరులు పాల్గొన్నారు.